క్లుప్తంగా

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా కొత్తూర్ గంగాధర్



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రానికి చెందిన బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు కొత్తూరు గంగాధర్ బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కాసం వెంకటేశ్వర్లు మంగళవారం గంగాధర్‌ను రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, ఎంపీ అర్వింద్‌కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

రన్నింగ్‌లో రికార్డు సృష్టించిన టీచరుకు సన్మానం



వేల్పూర్: రన్నింగ్‌లో రికార్డు సృష్టించిన వేల్పూర్ ఉపాధ్యాయుడు చంద్రదేవ్‌ను, ఇటీవల పదవీవిరమణ పొందిన ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం నర్సయ్యను వేల్పూర్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం శాలువాతో సన్మానించారు. చంద్రదేవ్ 5 రోజుల్లో 5 కిలోమీటర్లు, 10 రోజుల్లో 10 కిలోమీటర్లు, 15 రోజుల్లో 15 కిలోమీటర్లు, 21 రోజుల్లో 21 కిలోమీటర్ల రన్నింగ్ పూర్తి చేసి రికార్డు సృష్టించినట్లు వెల్లడించారు. ఉపాధ్యాయులు మురళీధర్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, గంట ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక పాయింట్ ఏర్పాటు చేయాలి



నందిపేట్(ఆర్మూర్): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఇసుక పాయింటును ఏర్పాటు చేయాలని కోరుతూ ఆర్మూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బైండ్ల ప్రశాంత్ ఆధ్వర్యంలో నందిపేట తహసీల్దార్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరత వల్ల ఇబ్బందులు ఉన్నాయన్నారు. ఈ సమస్యను పరిష్కరించ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ఆర్మూర్‌టౌన్: ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాజు సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని 23, 25వ వార్డులలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్నారు. అలాగే తడిపొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్నారు. చెత్త సేకరించే మున్సిపల్ వాహనాల్లోనే చెత్త వేయాలని సూచించారు. సానిటరీ ఎస్సై గజానంద్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమాళి, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల అభివృద్ధికి కృషి చేయండి



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బోధన్ కల్లగీత పారిశ్రామిక సంఘం ప్రతినిధులు కలిసిశారు. కల్లుగీత పారిశ్రామిక సంఘం అభివృద్ధితో పాటు గీత కార్మికుల అభివృద్ధికి కృషి చేయాలని వారు కోరారు. సంఘం ప్రతినిధులు మల్లెపూల శంకర్ గౌడ్, బుర్క లింగం గౌడ్, వై.శ్రీనివాస్ గౌడ్, హరి ప్రసాద్ గౌడ్, గంగాధర్‌గౌడ్, తదితరులున్నారు.

'యోగాతో శరీరం దృఢంగా తయారవుతుంది'



వర్ని: మోస్రా మండల కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం యోగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి రోజూ యోగా చేయడం ద్వారా శరీర దృఢత్వం పెరగడంతో పాటు మానసిక ప్రశాంతత, ఆయుష్షు పెరుగుతుందని మోస్రా మెడికల్ ఆఫీసర్ విజయకుమార్ అన్నారు. యోగాతో పాటు వాకింగ్ చేయాలని సూచించారు. ఆయుష్ మెడికల్ అధికారిణి జోత్స్న, సూపర్‌వైజర్ సాయమ్మ, ఏఎన్ఎంలు బీబీ రాణి, రాజ్యలక్ష్మి, సురేందర్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు గ్రహణం

- తవ్వారు.. వదిలేశారు
- అసంపూర్తి పనులతో రోడ్డు ప్రమాదాలు
- నందిపేట మండల కేంద్రంలో ఇబ్బంది పడుతున్న ప్రజలు



నందిపేట మండల కేంద్రంలో రోడ్డును తవ్వి వదిలేయడంతో గుంతలలో నిలిచిన వర్షపు నీరు

నందిపేట్(ఆర్మూర్): రోడ్డు విస్తరణ పనులకు గ్రహణం పట్టుకుంది. ఫలితంగా రోడ్డు వెడల్పు పనులు కొంత కాలంగా ముందుకు సాగడం లేదు. నందిపేట మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ పనులు అసెంబ్లీ ఎన్నికలకు నెల రోజుల ముందు ప్రారంభమయ్యాయి. ప్రారంభంలో పనులు చకాచకా జరిగాయి. దీంతో ఎన్నో ఏళ్ల కల నెరవేరుతుందని ప్రజలు సంతోషపడ్డారు. ఎన్నికల ముగిసిన వెంటనే పనులకు బ్రేక్ పడింది.

రూ.12 కోట్లతో పనులు..

నందిపేటలోని వివేకానంద చౌరస్తా నుంచి పెద్ద మజీద్ వరకు 1.57 కిలోమీటర్ల వరకు సెంట్రల్ లైటింగ్‌తో కూడిన రోడ్డు వెడల్పు పనులతో పాటు ఒక కిలోమీటరు డ్రైనేజీ పనుల కోసం గత ప్రభుత్వం రూ.12 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇందులో మధ్యలో నుంచి 50 ఫీట్ల రోడ్డును రెండు వైపులా వెడల్పు చేపట్టాలి. కాని మండల కేంద్రంలో ఇరువైపులా భవంతులు ఉండటంతో ప్రజాప్రతినిధులతో పాటు చోటామోటా నాయకుల ఒత్తిడి మేరకు చివరకు 35 ఫీట్లకు ఖాయం చేసి పనులు చేపట్టారు. ఇందులో మధ్యలో నుంచి 28 ఫీట్ల తారు రోడ్డు, 4 ఫీట్ల షోల్డర్‌ను వదిలి 4 ఫీట్ల డ్రైనేజీని ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల 4 ఫీట్ల షోల్డరును వదలకుండానే తారురోడ్డును ఆనుకుని డ్రైనేజీని నిర్మించారు. ఈ పనులు స్థానిక నంది విగ్రహం వరకు జరిగాయి.

రోడ్డులో పెద్ద పెద్ద గుంతలు..

నంది విగ్రహం నుంచి మజీద్ వరకు జీపీ పరిధిలోని వ్యాపార దుకాణాలు ఉండడంతో వాటిని తొలగించాలని అధికారులు సూచించారు. దుకాణాలు తొలగించడం వల్ల తమ జీవనోపాధి పోతుందని భావించిన వ్యాపారస్తులు కోర్టు ద్వారా స్టే తెచ్చుకున్నారు. దీంతో వీడీసీ రంగ ప్రవేశం చేసి పనులు చేపట్టేందుకు అధికారులపై ఒత్తిడి తెచ్చి రోడ్డును తవ్వించారు. తర్వాత వదిలేశారు. కోర్టు గడువు ముగిసినా పనులు చేపట్టడం లేదు. దీంతో తవ్విన రోడ్డులో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వర్షం నీటితో నిండిపోతున్నాయి. ప్రయాణికులకు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు ప్రారంభిస్తాం

నందిపేటలో రోడ్డు వెడల్పు పనులు కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపి వేశారు. అలాగే వ్యాపార దుకాణాలు తొలగించడంలో జాప్యం జరిగింది. పనులు ప్రారంభించేందుకు వీడీసీతో పాటు వ్యాపారస్తులు సహకరించాలి. నిబంధనల మేరకు పనులు పూర్తి చేస్తాం.

– రఘు బాలే, ఆర్అండ్‌బీ ఏఈ, ఆర్మూర్

నేటి చిత్రం

కంకర పోశారు.. తారు మరిచారు



మోర్తాడ్: ఏర్గట్ల మండలం తొర్తి వద్ద కల్వర్టు నిర్మించి కంకర పోశారు. తారు వేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి తారు పోయించాలి

– మాదం నరసయ్య, తొర్తి గ్రామం

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

ఆర్మూర్ : 90102 44405 | బాల్కొండ : 96666 49049 | బోధన్ : 99636 95349

టిప్పర్, లారీ పట్టివేత

మాక్లూర్: మండలంలోని దాస్‌నగర్ వద్ద వాహనపత్రాలతోపాటు అనుమతి లేకుండా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను ఆర్టీఏ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. ఇసుక తరలిస్తున్న లారీని సైతం పట్టుకొని మాక్లూర్ పోలీసులకు అప్పగించారు.

రేషన్ బియ్యం ..

బోధన్: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న నంబర్ ప్లేట్‌లేని పికప్ వాహనాన్ని జలంం గేట్–సాటాపూర్ ఎక్స్‌రోడ్ మధ్యలో సోమవారం అర్ధరాత్రి పట్టుకున్నట్లు ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణా రెడ్డి మంగళవారం తెలిపారు. సాటాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టగా, సన్నబియ్యం లోడ్ వాహనం అతివేగంగా వస్తుండగా వెంబడించి పట్టుకున్నామన్నారు. డ్రైవర్‌ను విచారించగా ఆర్మూర్ నుంచి మహారాష్ట్ర ప్రాంతంలోని ధర్మాబాద్ వైపు వెళ్తున్నట్లు చెప్పాడని పేర్కొన్నారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని తెలిపారు. వాహనంలో 2 నుంచి 3 టన్నుల వరకు బియ్యం ఉంటాయని ఎస్సై పేర్కొన్నారు.

ఒకరికి రెండు రోజుల జైలు

మాక్లూర్ : మద్యం సేవించి వాహనం నడిపిన ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష పడినట్లు ఎస్సై రాజశేఖర్ మంగళవారం తెలిపారు. మండలంలోని మానిక్‌బండార్‌కు చెందిన కేతావత్ బాలు గత నెల 28వ తేదీన మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. దీంతో రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ ప్రత్యేక సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ తీర్పు వెలువరించారు.

బాలిక అదృశ్యం

రుద్రూర్: పోతంగల్ మండలం సుంకిని గ్రామానికి చెందిన బాలిక(16) అదృశ్యమైనట్లు ఎస్సై సునీల్ తెలిపారు. మంగళవారం వెళ్లిన బాలిక రాత్రయిన ఇంటికి రాలేదు. స్నేహితుల వద్ద వాకబు చేసినప్పటికి ఆచూకీ లభించలేదు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కమ్మర్‌పల్లి: స్థానిక కేజీబీవీలో 6వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రత్యేకాధికారి గంగామణి తెలిపారు. ఉచిత విద్య, భోజన వసతి, యూనిఫామ్స్ పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, ఉపకార వేతనాలు అందజేస్తామన్నారు. విద్యార్థినికి ఒక నెలకు రూ.275 చొప్పున 11 నెలలకు రూ.3,025 కాస్మొటిక్ చార్జీలు అందజేస్తామన్నారు. 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. పూర్తి వివరాలకు 7675964429.

గ్రామ పెద్ద చెరువును అప్పగించి న్యాయం చేయాలి



వినతి పత్రం అందిస్తున్న జలంం ముదిరాజ్ కుల సంఘ ప్రతినిధులు

బోధన్: ఎడపల్లి మత్స్యకారుల సంఘం అధీనంలో ఉన్న తమ గ్రామ పెద్ద చెరువును తమకే అప్పగించి న్యాయం చేయాలని జలంం గ్రామ ముదిరాజ్ కుల సంఘ ప్రతినిధులు, సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ దత్తాత్రేయకు వినతి పత్రం అందించారు. తమ గ్రామ శివారులో రెండు చెరువులున్నాయని, 30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పెద్ద చెరువును వారి కబ్జా నుంచి విడిపించి విచారణ చేపట్టాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా రెండు చెరువు కట్టలపై పండ్ల మొక్కలు నాటి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ముదిరాజ్ సంఘ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఒడ్డెన్న ముదిరాజ్, జనార్ధన్, కార్యదర్శి అశోక్, గ్రామ అధ్యక్షుడు గేట్ సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



బోధన్‌టౌన్(బోధన్): రానున్న బక్రీద్ పండుగను దృష్టిలో పెట్టుకొని పట్టణ శివారులోని ఈద్గా వద్ద మౌలిక వసతులు కల్పించాలని ఎంఐఎం పార్టీ పట్టణ అధ్యక్షులు మీర్ ఇలియాస్ అలీ కోరారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణను కలిసి వినతి పత్రం అందించారు. కమిషనర్ వెంట తహసీల్దార్ విఠల్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించండి



ఎడపల్లి ఎంపీడీవో శంకర్‌కు వినతి పత్రం అందిస్తున్న జీపీ కార్యదర్శులు

బోధన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఎడపల్లి ఎంపీడీవో శంకర్‌కు మండలంలోని జీపీ కార్యదర్శులు వినతి పత్రం అందించారు. 16 నెలల నుంచి ఎలాంటి గ్రాంట్స్ రాలేదని, 10 నెలలుగా ఐఎఫ్ఎంఐఎస్ చెక్కులు ట్రెజరీల్లో పెండింగ్‌లోనే ఉండిపోయాయని పేర్కొన్నారు. పారిశుధ్య నిర్వహణ కష్టంగా మారిందని తెలిపారు. కొత్తగా అమలు చేస్తున్న డీఎస్ఆర్(డైలీ శానిటేషన్ రిపోర్ట్) యాప్‌లో తమ వ్యక్తిగత భద్రతకు భంగం కలిగించే విధంగా బయోమెట్రిక్ హాజరు ఉందని వివరించారు. జీపీ నిర్వహణకు సంబంధించిన ఆర్థికపరమైన విధులు ఇక నుంచి చేయలేమని వినతి పత్రం ద్వారా తెలిపారు. జీపీ కార్యదర్శులు ఉదయ్ భాస్కర్, రమేష్, నాగరాజు, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్.. పరేషాన్..

- రోజుకు 30 కార్డులకే రేషన్ పంపిణీ
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



రేషన్ డీలర్ సకాలంలో దుకాణం తీయకపోవడంతో బియ్యం కోసం బారులు తీరిన లబ్ధిదారులు

ఆర్మూర్‌టౌన్: ప్రతినెలా ఒకటో తేది రాగానే పేదలు రేషన్ బియ్యం కోసం రేషన్ డీలర్ల దుకాణాల వద్దకు వచ్చి బియ్యం తీసుకెళ్తుంటారు. ప్రభుత్వం రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని ప్రజలు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు మూడు నెలలకు సంబంధించిన బియ్యంను ఒకేసారి ఇస్తామని సమాచారం అందించడంతో రేషన్ డీలర్ల దుకాణాల వద్దకు ప్రజలు బారులు తీరుతున్నారు. రేషన్ బియ్యం తీసుకోవాలంటే యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రేషన్ డీలర్లు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఆ తరువాత సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఇవ్వాలి. కాని రేషన్ డీలర్ల ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండటంతో ప్రజలు గంటల తరబడి వేచిచూడాల్సి వస్తోంది. ఉదయం 7 గంటలకు లబ్ధిదారులు బియ్యం కోసం వచ్చి సంచులను లైన్ పెట్టి నీడలో కుర్చుంటున్నారు. రోజుకు 30 కార్డులకే డీలర్లు..బియ్యం అందిస్తున్నారు. కొన్నిచోట్ల ఉదయం రేషన్ డీలర్లు దుకాణాలు ఉదయం పూట తీయకుండా సాయంత్రం తెరుస్తున్నారు. రెవన్యూ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో ఇదంతా జరుగుతుందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రతి ఒక్కరికి రేషన్ బియ్యం అందించే విధంగా చూడాలని అధికారులను కోరుతున్నారు.

పర్యవేక్షణ చేస్తాం



రేషన్‌డీలర్లు ప్రతిరోజు సమయపాలన పాటించే విధంగా చర్యలు తీసుకుంటాం. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రతి ఒక్కరికి రేషన్ అందుతుంది. ఎటువంటి గొడవలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– సత్యనారాయణ, తహసీల్దార్, ఆర్మూర్

నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడి



కోటగిరిలో విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు



సాలూరలో.. ఏఎంసీ చైర్మన్ చీల శంకర్, సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, అధికారులు



నందిపేటలో ..



పెర్కిట్: దేగాంలో.. ఏవో రాంబాబు



డొంకేశ్వర్‌లో.. ఏవో మధుసూదన్

సాక్షి నెట్‌వర్క్ : నాణ్యమైన విత్తనాల వాడకం వల్లే అధిక దిగుబడి సాధించగలమని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచించారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం సాలూర, కోటగిరి, వేల్పూర్, మాక్లూర్, నందిపేట మండలాల్లో నాణ్యమైన విత్తనం– రైతన్నకు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రూర్ ప్రాంతీయ వరి పరిశోధన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ..నాణ్యమైన విత్తనాలతో పంట దిగుబడి 15 శాతం వరకు పెరిగే అవకాశాలుంటాయని పేర్కొన్నారు. పరిశోధన కేంద్రం ద్వారా నాణ్యమైన విత్తనాన్ని సేకరించి సాగు సాంకేతికతలను పాటిస్తే అదే విత్తనాన్ని మూడేళ్ల వరకు వాడుకోవచ్చునని సూచించారు. పలువురు రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు.



మాక్లూర్‌లో.. ఏవో పద్మ, శాస్త్రవేత్త చంద్రశేఖర్



వేల్పూర్ రైతు వేదికలో ..

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



జలాల్‌పూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీధర్

భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని ఆర్డీవో రాజా గౌడ్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో వేర్వేరుగా సూచించారు. బోధన్, ఆర్మూర్, బాల్కొండ, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలో మంగళవారం సదస్సులు నిర్వహించగా.. వారు పలు గ్రామాల్లో పర్యటించి సదస్సులను పర్యవేక్షించారు. సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలున్న వారు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. రైతులు దరఖాస్తులను అందజేయగా.. అధికారులు స్వీకరించారు.

– పెర్కిట్/బాల్కొండ/బోధన్/మాక్లూర్/రుద్రూర్



సాలూర మండలం మందర్నాలో దరఖాస్తులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో



ఆలూర్ మండలం మిర్దాపల్లిలో.. ఆర్డీవో రాజా గౌడ్

21 వరకు ఐటీఐలో అడ్మిషన్లు

నిజామాబాద్‌అర్బన్: ఐటీఐలో ఈనెల 21 వరకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని ఐటీఐ బాలుర ప్రిన్సిపల్ యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పదవ తరగతి మెమో, పుట్టిన తేదీ, ఆధార్‌కార్డులతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 99481 95654 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

సినిమా

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-3 కరాటే కిడ్ లెజెండ్స్-11.20, 5.10.35
ఖలేజా-1.35, భైరవం-7.25

స్క్రీన్-4 భైరవం-10.25, 4.20, 10.15
సింగిల్-1.35, 7.30

మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,600	వెండి(కిలో)	1,02,500
22 క్యారెట్స్	90,095		

– నిజామాబాద్ బిజినెస్

సంక్షిప్తం

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



వేల్పూర్: వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడలో నోముల రాకేశ్, యేంగంటి కరుణకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ నాయకులు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గుడాల మోహన్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు టక్కర్ గంగాధర్, గడ్డల నర్సయ్య, భూమన్న, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలో 10 మంది బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా మోయినొద్దిన్, శివాలయం చైర్మన్ శరత్ రెడ్డి, దాము, అనీల్, ప్రమోద్, జావిద్, ఖలీం తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలు..

వేల్పూర్: వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను మంగళవారం అధికారులు, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి అందజేశారు. ఇళ్లు మంజూరైన వారు తొందరగా పనులు చేపట్టాలని వారు సూచించారు. జీపీ ప్రత్యేక అధికారి సాయిలు, జీపీ కార్యదర్శి మౌనిక, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రంగు అనిల్‌గౌడ్, జి.గంగారెడ్డి, జేమ్స్ గంగారెడ్డి, సొడ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్: కల్లెడి గ్రామంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులైన డేగ పోశెట్టి, సాయినేని వెంకటేశ్వరరావులు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు నీలగిరి శ్రీనివాస్, అబిబూ, నర్సారెడ్డి, పాషా పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను సద్వినియోగం చేసుకోవాలి

కమ్మర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడులలో ఉచిత విద్యను అందిస్తోందని, సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యావంతులు కావాలని కమ్మర్‌పల్లి ఎంఈవో ఆంధ్రయ్య అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు మంజూరు అయిన ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. పాఠశాలలు తెరిచేలోగాని అన్ని పుస్తకాలను అందజేసే విధంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాఠశాల ప్రారంభమైన మొదటి రోజునే విద్యార్థులకు పుస్తకాలు అందజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. బషీరాబాద్ హెచ్ఎం గంగాధర్, ఉపాధ్యాయులు మూర్తి, బంతిలాల్, దేవన్న,రాకేష్, రాజకిరణ్, మధుకర్, అంజయ్య, రాజేష్, లలిత, రతన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ఏర్పాటు

మాక్లూర్: మాణిక్‌భండార్‌లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జి.పురుషోత్తం ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడుగా తలారి నర్సయ్య, ఉపాధ్యక్షులుగా వినోద్‌నాయక్, బండ్ల మురళి, ప్రధాన కార్యదర్శిగా గుండ్ల సురేష్, కార్యదర్శిగా కిరణ్, క్యాషియర్‌గా కంఠం ఆనంద్, జాయింట్ సెక్రటరీలుగా రవినాయక్, ఆకుల రవి, సలహాదారులుగా జి.పురుషోత్తం, కంటాజీ రాజేశ్వర్‌ను ఎన్నుకున్నారు.